క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం: విద్యార్థులు, పరిశ్రమ నిపుణులకు సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి ఉండాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని ముంజేరు మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ. అర్జునరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన డిజిటల్ సమ్మిట్-2024 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికతలపై ఉన్న ప్రాముఖ్యత, డిజిటల్ యుగంలో నూతన సాంకేతికతను ఏవిధంగా వాడాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మిరాకిల్ సీఈఓ లోకం ప్రసాద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా చట్టాలు

● న్యాయవాదులు వరలక్ష్మి, పద్మజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది వరలక్ష్మి

డెంకాడ: మహిళలకు రక్షణగా అనేక చట్టాలు ఉనాయని సీనియర్ న్యాయవాదులు పీవీ వరలక్ష్మి, ఏవీఎల్ పద్మజ అన్నారు. జిల్లా జడ్జి బి.సాయికల్యాణ చక్రవర్తి ఆదేశాల మేరకు జాతీయ మహిళా కమిషన్, జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహహింస, మనోవర్తి, మహిళల పట్ల జరుగుతున్న లైంగిక అత్యాచారాలకు సంబంధించిన చట్టాలపై వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గుడ్, బ్యాడ్ టచ్, మహిళలకు ఆస్తి హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా న్యాయ సేవా సంస్థని సంప్రదించవచ్చని, టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఏడీఏ ఎ.నాగభూషణం, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కల్లాజీరావు, వివిధ విభాగాలకు చెందిన జన్య, అరుణ్‌కుమార్, తదతరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి..

● ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న

నెల్లిమర్ల రూరల్: మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం, నెల్లిమర్ల మండలాల ఉద్యానవన శాఖాధికారి డి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని కొండవెలగాడలో గురువారం ఆమె పర్యటించి మామిడి రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎకరానికి రూ.2 వేలు చొప్పున మీ సేవా కేంద్రాల్లో చెల్లించి మామిడి పంటకు బీమా చేయించుకోవాలన్నారు. అధిక, అకాల వర్షపాతం, చీడపీడలు, ఉష్ణోగ్రత వ్యత్యాసాలు, తదితర కారణాలతో పంట పోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31 లోపు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: మండలంలోని ఆరు పంచాయతీల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న రేషన్ షాపులకు సంబంధించి డీలర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో ముంజేరు-2 ఓసీ, రాజాపులోవ ఓపెన్, పోలిపల్లి బీసీ-ఈ, రావాడ బీసీ-ఈ, ఆర్అండ్ఆర్ కాలనీ(లింగాలవలస) బీసీ-ఎ (ఉమన్), గూడెపువలస ఎస్సీ కేటగిరీల వారికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఇంటర్ మీడియట్ పాసై సంబంధిత స్థానిక పంచాయతీ నివాసి అయి ఉండాలన్నారు. వయసు 18 నుంచి 40 మధ్య వయసు కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

పూసపాటిరేగలో..

పూసపాటిరేగ: మండలంలోని చల్లవానితోట (ఎస్టీ-మహిళ), చోడమ్మ అగ్రహారం (ఓసీ-మహిళ), గుంపాం (బీసీ-బీ) గ్రామాల్లో రేషన్ డిపోలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ తాడ్డి గోవింద ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్ పాసై 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విజయనగరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

అరచేతిలో ఆహ్వానం



పాతం కాలం నాటి ఆహ్వాన పత్రిక



కొత్త రకం కార్డులు





● మారుతున్న వివాహ వేడుక పిలుపులు

విజయనగరం: పెళ్లిళ్ల సీజన్ ఆరంభమైంది. ఈ రోజుల్లో వివాహ ఆహ్వాన పత్రికల నుంచి రిసెప్షన్ వరకు పెద్దఎత్తున ఖర్చు చేస్తున్నారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులను ఆహ్వానించేందుకు ముద్రిస్తున్న 'పెళ్లి పిలుపు' ఆహ్వానపత్రికల రూపం ఒకనాటికి, ఇప్పటికీ ఎంతో మార్పు చెందింది. పెళ్లి హంగూ ఆర్భాటాలతో ఎంత ఘనంగా చేస్తున్నారో.. ఆహ్వాన పత్రికలకూ అంతే ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటిని కూడా విభిన్నంగా, మహోన్నతంగా అందించేందుకు కొందరు పెద్ద కసరత్తే చేస్తున్నారు.

☛ అరటి ఆకు నమూనా పత్రికలు, స్క్రీనింగ్ కార్డుల నుంచి ఫోల్డింగ్, ఎన్వలప్ కవర్లతో శుభలేఖలు వచ్చాయి. రాజుగారి సందేశం నమూనాలో కొంతకాలం ప్రత్యేకతను చాటాయి. బాక్స్‌టైప్‌లో ఆహ్వాన పత్రికలు ప్రత్యేకంగా వచ్చాయి. నాడు తపాలా (పోస్టు) ఉండడంతో పెళ్లి పత్రికలను పోస్టులో పంపేవారు. వ్యాపార దిగ్గజం అంబాని కుమారుడి పెళ్లికి ఏకంగా బంగారు, వెండి ఆహ్వాన పత్రికలు పంచారు. ఆ కార్డు బాక్స్‌లో ప్రత్యేకంగా తయారుచేయించిన గిఫ్ట్‌ను కూడా పొందుపర్చడం విశేషం. ఇటీవలి కాలంలో వివాహం, పెళ్లిపందిరి ఇతర అలంకరణలపైన దృష్టి సారించినట్లుగానే పెళ్లి ఆహ్వాన పత్రికలకూ ఎంతో ప్రాధాన్యం ఇచ్చి కొత్తదనం కోసం ప్రయత్నిస్తున్నారు.

☛ ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌లో పెళ్లి ఆహ్వాన పత్రికలను ఫొటో తీసి బంధువులు, స్నేహితులకు పోస్ట్ చేస్తున్నారు. ఇంకో అడుగు ముందుకేసి వధువు, వరుడు, అత్తామామలు, అమ్మానాన్నల ఫొటోలు వేసి, అందంగా డిజైన్ చేయించి, వాటిని వాట్సాప్‌లలో బంధువులు, స్నేహితులు, శ్రేయోభి లాషులకు పంపుతున్నారు. వీటితో పాటు ఫంక్షన్ హాల్‌లో లొకేషన్‌లను పోస్టు చేస్తూ చిరునామా తెలుసుకోవడంలో ప్రోమోలు రూపొందించి (వీడియోలతో) సునాయాసం చేస్తున్నారు. కొత్త జంట, వారి తల్లిదండ్రుల ఫొటోలతో వీనులవిందైన సంగీతం, తదనుగుణంగా పెళ్లి పాటలతో వీడియోలు, డిజిటల్ పత్రికలు ఇప్పటి ట్రెండ్. అందమైన అక్షరాలు, ఇంకా అందంగా డిజైన్ చేసి, మంచిమంచి పాటలు, అనువైన నేపథ్య సంగీతంతో పెళ్లి జరిగే ప్రదేశం, రిసెప్షన్ జరిగే చోటు ఇలా.. అన్ని వీడియోల రూపంలో పంపి ఆహ్వానిస్తున్నారు. కట్నాలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అచ్చు వేయిస్తుండటం విశేషం

అన్నింటికి ప్రోమో ఆహ్వానాలు

ఒక్క పెళ్లిళ్లకే కాదు. రిసెప్షన్లకు ప్రత్యేకంగా, పుట్టిన రోజులకు, వస్త్రాలంకరణ వేడుకలు, గృహ ప్రవేశాలకు ఇలా..ఏ శుభకార్యం చేసినా వాట్సాప్ ప్రోమోలు తయారు చేయిస్తున్నారు. ఇటీవలి కాలంలో వాటి గిరాకీ, ఆదరణ బాగా పెరిగింది.

–ధీరజ్, డిజైనర్, విజయనగరం.

ఆదరణ తగ్గిపోయింది

గతంలో పెళ్లిళ్లకు వెయ్యికార్డులు ప్రింటింగ్ చేయించేవారు. ప్రస్తుతం వందకార్డులు అచ్చువేయిస్తున్నారు. ఇక ఇతర శుభకార్యాలకైతే అసలు కార్డులే కొట్టించడం లేదు. పెళ్లిళ్ల సీజన్‌ల పెళ్లికార్డుల ప్రింటింగ్ గిరాకీ బాగా ఉండేది. సెల్‌ఫోన్, వాట్సాప్‌లు రావడంతో ఇప్పుడదంతా తగ్గిపోయింది.

– ఉదయ్‌కిరణ్, ప్రింటింగ్ ప్రెస్, విజయనగరం.

కొసమెరుపు..

వివాహ ఆహ్వాన పత్రిక పేరుతో సైబర్ నేరగాళ్లు లింకులు పంపిస్తున్నారు. మోసపూరిత సందేశాలు, ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ (ఏపీకే) ఫైల్స్ పంపించి డబ్బు కొల్లగొడుతున్న సంఘటనలూ వెలుగులోకి వస్తున్నాయి. 'డిజిటల్ వెడ్డింగ్ ఇన్విటేషన్' పేరుతో కొత్త నంబర్ల నుంచి వచ్చే ఆహ్వాన పత్రికలు, వీడియోలు, లింకులు, ఫైల్స్‌ను క్లిక్ చేసే ముందు బాగా ఆలోచించాల్సిన అవసరం ఉందని సైబర్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

న్యాయం చేయండి..

● డీటీని కోరిన చవుడువాడ పంచాయతీ రైతులు



డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

పూసపాటిరేగ: తమ అధీనంలో ఉన్న భూములను కాపాడి న్యాయం చేయాలని చవుడువాడ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు (బాధిత రైతులు) కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పదిహేనేళ్లుగా భూములు సాగుచేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తుంటే.. కొంతమంది కావాలనే తమపై తప్పుడు ఫిర్యాదులు చేశారన్నారు. కోనయ్యపాలెం పులికొండ సమీపంలో గల భూమిని 84 మంది రైతులు సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తుంటే.. కొంతమంది కావాలనే తమపై (ఐదుగురిపై) అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. చవుడువాడ పంచాయతీ పరిధిలో పలువురు బడాబాబుల వాగులు, చెరువు గర్భాలు, బంజరు భూములు, శ్మశానాలను ఆక్రమించుకున్నా.. నోరు మెదపని అధికారులు నిరుపేదలమైన తమకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్న రెడ్డి, మొంగం శ్రావణ్‌కుమార్, పి.నారాయణప్పారావు, పి. గొల్ల, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల బోర్డులు ఏర్పాటు చేయండి

● డ్వామా పీడీ కల్యాణ్ చక్రవర్తి



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ, ఇతర అధికారులు

విజయనగరం రూరల్: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులపై ప్రతి గ్రామంలోనూ బహిరంగంగా బోర్డులు ఏర్పాటు చేయాలని డ్వామా పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనుల్లో అవకతవకలు చోటుచేసుకుంటే చర్యలు తప్పవన్నారు. సంతకాలు లేకుండా దొంగ మస్తర్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలతలు కూడా సక్రమంగా లేవని సామాజిక తనిఖీ బృందం చెప్పడంతో టెక్నికల్ సహాయకులను ఆరా తీశారు. ఉపాధి హామీకి సంబంధించిన ప్రతీ పని ఎంతో పారదర్శకంగా చేపట్టాలన్నారు. దొంగ మస్తర్లతో డబ్బులు డ్రా చేసుకున్న వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటరమణ, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఎంపీడీఓ తిరుపతినాయుడు, ఏపీఓ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు



భోగాపురం: సదస్సులో మాట్లాడుతున్న ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు



నెల్లిమర్ల: కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు



విజయనగరం రూరల్: వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



పూసపాటిరేగ: ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

భోగాపురం: దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని.. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండల పరిధిలోని బసవపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, గాలి రాజారావు, రీసు రమణ, కుంచం సూరప్పారావు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి. సుదర్శనరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు సూచించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడుతూ.. ఎప్పటినుంచో అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సదస్సుల ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ రాజు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, మండల సర్వేయర్ దివ్యమానస, వీఆర్‌ఓ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా..

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మండలంలోని మలిచెర్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించి, పలువురు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాట్ల కీర్తి, తహసీల్దార్ కూర్మనాథ్, సర్పంచ్ రమా కుమారి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలు పరిష్కారం..

పూసపాటిరేగ: రెవెన్యూ సభలతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. మండలంలోని కొల్లాయివలస గ్రామంలో తహసీల్దార్ తాడ్డి గోవింద అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ప్రజాప్రతినిధులు తాడిశెట్టి సూర్యనారాయణ (బాబు), వందనాల అప్పలరాజు, దువ్వు అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని టిడ్కో కాలనీకి వెళ్లే రహదారిని ఆర్డీఓ దాట్ల కీర్తి గురువారం పరిశీలించారు. ఈ రహదారిలో గతంలో కూలిపోయిన కల్వర్టును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే టిడ్కో కాలనీలో ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి, వాటి నిర్మాణం ఏ దశలో ఉన్నదీ ఆరా తీశారు. రవిశంకర్, దివ్యమానస, గోవింద్, తదితరులున్నారు.

● పరిశీలన..



నెల్లిమర్ల మండలంలోని గొర్లిపేట సమీపంలో ఉన్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మళ్లింపు కాలువను ఆర్డీఓ దాట్ల కీర్తి గురువారం పరిశీలించారు. కాలువ నిర్మాణానికి సంబంధించి పనుల పురోగతిపై సంబంధిత ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. ప్రధానంగా సాలిపిసోమరాజుపేట కొండ నుంచి టన్నెల్ తవ్వకాలకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్, రెవెన్యూ, టీఆర్‌టీఎస్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

వీధి దీపాల నిర్వహణపై అసంతృప్తి

- ప్రజల ముందు పరువు పోతోందంటూ కౌన్సిలర్ల ఆవేదన
- ప్రజా సమస్యలపై కార్పొరేషన్ సాధారణ సమావేశంలో చర్చ
- వ్యాపార, వాణిజ్య సంస్థలకు నీటి మీటర్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐదు ఎకరాల స్థలం కేటాయింపు



హాజరైన కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరం జిల్లా కేంద్రంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని.. అధిక శాతం ప్రాంతాలు చీకటి పడితే అంధకారంలో మగ్గుతున్నాయని.. ఈ విషయమై ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు జీరో అవర్ కేటాయించగా.. వివిధ డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు స్థానిక సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రధానంగా వీధి దీపాల నిర్వహణపై జరుగుతున్న నిర్లక్ష్యంపై కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. 45వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కేఎల్‌పురంలో విద్యుత్ స్తంభాలు వేసిన అధికారులు వెలగని వీధి దీపాలు వేయటంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తక్షణమే వాటిని మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అల్లు చాణక్య మాట్లాడుతూ.. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ రహదారి విస్తరణ పనులు చేపట్టామని, అయితే ఆ మార్గంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవటంతో అంధకారం అలుముకుంటుందన్నారు. ప్రధాన మార్గాల్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే, వీధుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇదే సమస్యపై కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, పతివాడ గణపతి, బాలి పద్మావతి సైతం సమావేశంలో ప్రస్తావించారు. వీధిలైట్లు పాతవి వేయడం వల్ల రెండు రోజులకు మించి వెలగడం లేదన్నారు. అదేవిధంగా 18వ డివిజన్ కార్పొరేటర్ ఎం.రమాదేవి మాట్లాడుతూ.. తమ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు గంజాయి బ్యాచ్ ప్రజలను ఇబ్బంది పెడుతోందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు మాట్లాడుతూ.. కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంతో పాటు ప్రకాశం పార్కు నుంచి రాజీవ్ స్టేడియం వైపు సాయంత్రం ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందని, నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ సుంకరి బాబు మాట్లాడుతూ.. కంటోన్మెంట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ప్రస్తుతం పనిచేయడం లేదని, దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

అజెండాలోని 35 అంశాలకు ఆమోదం..

మరోవైపు అజెండాలోని 36 అంశాలపై జరిగిన చర్చలో ఒక్క అంశం తప్ప 35 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వీటిలో ప్రధానంగా వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపులు, రెస్టారెంట్లు, బహుళ అంతస్తులు, సినిమా హాల్స్, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు నీటి మీటర్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటిని జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. అదేవిధంగా నీటిపన్ను చార్జీలు పెంచుతూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో 26 పనులు చేయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే పారిశుధ్య కార్మికులకు దుస్తులు, దుప్పట్లు, చీరలు, టవల్స్ కొనుగోలు చేసేందుకు రూ.9.50 లక్షలు కేటాయించారు. వేణుగోపాలపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకటరాజేశ్వరరావు, వివిద విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం కార్పొరేషన్‌కు నూతన లోగో

● ఆవిష్కరించిన మేయర్, కార్పొరేటర్లు



లోగో ఆవిష్కరిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతన లోగో ఏర్పాటు చేశారు. నగర ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన లోగోను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, పలువురు కార్పొరేటర్లు గురువారం ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టేబుల్ అజెండాగా ప్రవేశపెట్టిన నూతన లోగో రూపకల్పనపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. లోగో ఎంపిక పోటీల్లో జేవీవీ సత్యనారాయణ రూపొందించిన లోగోను సభ్యులు ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. విజయనగరం కార్పొరేషన్ ఔన్నత్యాన్ని ప్రతిబింబించే విధంగా లోగో రూపకల్పనకై సెప్టెంబర్ నెలలో చిత్రకారులను ఆహ్వానించగా.. అనేకమంది స్పందించారన్నారు. అయితే జేవీవీ సత్యనారాయణ తయారు చేసిన లోగోకు నగర పౌరులు మద్దతు తెలిపినట్లు చెప్పారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఉత్తమ లోగోను ఎంపిక చేయడం జరిగిందన్నారు.